టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ నారాయణరెడ్డి.. పరీక్ష కేంద్రాల తనిఖీ

వికారాబాద్, మార్చి 23 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరిటెండెంట్‌కు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. టెన్త్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వికారాబాద్‌లోని బ్రిలియంట్ పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతంపై ఆరా తీశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన మీదట పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో అంగవైకల్యం కలిగిన విద్యార్థి పరీక్షను సహాయకుడితో రాయిస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి సహాయకుడి విద్యార్హత గురించి అడిగి తెలుసుకున్నారు.



పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రశాంతంగా ముగిసిన గణితం పరీక్ష

వికారాబాద్, (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 80పరీక్షాకేంద్రాల్లో 14,794 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 14,653మంది హాజరయ్యారు. 141 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లాలో 99.04 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 13,411 మంది ఉండగా, వారిలో 13,349 మంది హాజరు కాగా, 62 మంది గైర్హాజరయ్యారు. అదే వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు 1,383 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1,304 మంది విద్యార్థులు హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 99.53 శాతం, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థుల్లో 94.28 శాతం హాజరు నమోదైంది.

ఉపాధి కూలీలకు నీడేది!

భానుడి భగభగలు.. పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు

బషీరాబాద్, మార్చి 23: ఉపాధిహామీ పథకంలో భాగంగా పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నిత్యం అసౌకర్యాల మధ్య పనులు చేస్తున్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండటంతో కూలీలు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రథమచికిత్స కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, తాగునీరు తదితర సౌకర్యాలు పని ప్రదేశంలో అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వేసవిలో కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు దృష్టిసారించడం లేదు. ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశాల్లో గతంలో టెంట్లతో పాటు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమై ఎండలు జోరుందుకోవడంతో ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదముందని వాపోతున్నారు. పని ప్రదేశాల్లో నీడ కోసం గ్రీన్‌నెట్ షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఇంత వరకు వాటి ఊసేలేదు. తాగునీరు ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నా సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పని చేసే ప్రాంతంలో గాయపడితే ప్రథమ చికిత్స చేసేందుకు కిట్లు కూడా లేవన్నారు. అదేవిధంగా కూలీలకు ఏళ్లతరబడి పార, గడ్డపార తట్టలు ఇవ్వడం లేదు. సొంతంగా ఎవరికి వారే ఇంటి నుంచి తెచ్చుకొని పనులు చేస్తున్నారు. బషీరాబాద్ మండలంలో ప్రస్తుతం 2,800 మందికి పైగా కూలీలు పనులను వెళుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



కూలి గిట్టుబాటు కావడం లేదు



వేసవిలో ఉపాధి పనులు చేస్తే కూలితో పాటు అదనంగా భత్యం చెల్లిస్తుండేవారు. ఎండలో పనిచేసినా కూలి డబ్బులు గిట్టుబాటు కావడం లేదు. పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

- కుర్వ నర్సింహులు, ఉపాధి కూలీ, పర్వత్‌పల్లి

వేసవి భత్యంపై ఆదేశాలు రాలేదు



కూలీల వేసవి భత్యం విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. కూలీలకు తాగునీటి బిల్లును వేతనాల్లోనే జమ చేస్తున్నాం. కూలీ రూ.272 చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- శారద, ఏపీవో, ఎంఎన్ఆర్ఈజీఎస్, బషీరాబాద్



పరిగిలో పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)

మాఫియా డెన్!

పరిగి టౌన్?

పరిగి, మార్చి 23: వికారాబాద్ జిల్లాలోని పరిగి పట్టణాన్ని అక్రమార్కులు అడ్డాగా చేసుకుంటున్నారు. పరిగి చిన్న పట్టణమే అయినా సరిహద్దు. నాలుగైదు జిల్లాలకు అక్రమరవాణా, వ్యాపార లావాదేవీలకు కేంద్ర బిందువుగా మారింది. పరిగిలో నిర్వహించే వివిధ చట్ట వ్యతిరేక వ్యాపారాలతో అక్రమార్కులు రూ.కోట్లు గడిస్తున్నారు. మొన్న ఇసుక అక్రమ రవాణా, మత్తు పదార్థాల అమ్మకం, నిన్న అక్రమంగా రేషన్‌బియ్యం సరఫరా, గంజాయి దందా, జీరోవ్యాపారం, కల్తీ టీ పౌడర్, తాజాగా మటన్, చికెన్, ఐస్‌క్రీమ్ కల్తీ దందా.. ఇలా పరిగి కేంద్రంగా రోజూ ఏదో ఒక అక్రమ వ్యాపారం బయటకొస్తోంది. ఒక్కోదందా ఒక్కో శాఖ పరిధిలోకి రావడంతో అధికారులు దేన్నీ పూర్తిగా పట్టించుకోవడం లేదు. కొందరు లంచాలకు మరిగి అక్రమాలను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పరిగిలో అక్రమ బియ్యం, బెల్లం, కల్తీకల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, కలప, గంజాయి, కల్తీ టీ పౌడర్, మత్తు పదార్థాల సరఫరా, కలప.. ఇలా వెలుగు చూసిన అక్రమ వ్యాపారాలకు ఈ ప్రాంతాన్ని అక్రమార్కులు ఎలా అనూకలంగా మార్చుకున్నారో తెలియజేస్తున్నాయి.

అధికారులను మేనేజ్ చేస్తూ అక్రమ వ్యాపారాలు

కలప, కల్తీ టీపొడి, జీరో దందాలకు అడ్డా!

రేషన్ బియ్యం, మత్తుపదార్థాల సరఫరా

అధికారుల నామమాత్రపు చర్యలు

అన్ని శాఖల చర్యలతోనే అక్రమాలకు చెక్

అక్రమ వ్యాపారాలకు పరిగి పట్టణం కేంద్ర బిందువుగా మారింది. కొన్నేళ్లుగా వెలుగుచూసిన దందాలే దీనికి తార్కాణాలు. అక్రమ రేషన్ బియ్యం, నల్లబెల్లం, కల్తీకల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, కలప రవాణా, కల్తీ టీ పౌడర్, గంజాయి, మత్తు పదార్థాల అమ్మకం, వినియోగం ఇలా అనేక రకాల చట్టవ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకుటున్నారు అక్రమార్కులు.



పరిగిలో పట్టుబడిన కూల్‌డ్రింక్స్ మెటీరియల్ (ఫైల్)

దనే ఆరోపణలూ ఉన్నాయి. 'దొరికితే దొంగ... లేదంటే దొర' అన్న చందగా ఉంది వారి వ్యాపారం. గతంలో పరిగిలో జీరో దందాతో భారీగా కూల్‌డ్రింక్‌లు, ఇతర సరుకులు పట్టుబడ్డాయి. సంవత్సరాలు గడిచినా ఈ కేసులో పురోగతి లేదు. బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారో అధికారులకే తెలియాలి. ఈ కేసు తమ పరిధికి రాదని అప్పట్లో పోలీసులు వాణిజ్య పన్నుల శాఖకు లేఖ రాయడం విమర్శలకు తావిస్తోంది. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కూడా నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. అక్రమ దందాకు అదుపే లేదు. కల్తీ చాయిపత్తి కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి సంఘటనలను బట్టిచూస్తే పరిగి కేంద్రంగా రకరకాల అక్రమ దందాలు జోరుగా జరుగుతున్నాయనేది సుస్పష్టం.

జీరో దందాలో ఆరితేరిన అక్రమార్కులు

కొన్నేళ్ల క్రితం క్వింటాళ్ల కొద్దీ కల్తీ చాయిపత్తి దొరకడంతో అధికార యంత్రాంగం సైతం ఆశ్చర్యానికి గురైంది. ఉదయం లేవగానే తాగే టీతోనే మనపై కల్తీ పదార్థాల దాడి మొదలవుతోందని ప్రజలు హతాశులయ్యారు. అక్రమార్కులు డబ్బు ఆశకు ప్రజల ప్రాణాలు పణంగా పెడుతున్నారు. కొందరు వ్యాపారులు ఏళ్లుగా అక్రమ దందాల్లో అరితేరారు. ఏది లాభసాటిగా ఉంటే దానినే ఎంచుకుంటున్నారు. తక్కువ సమయంలో కోటీశ్వరులు కావడమే వారి లక్ష్యం. కేసులకూ భయపడటం లేదు! ఏడేనమిదేళ్ల వ్యవధిలోనే ఒకరిద్దరు హవాలా వ్యాపారులు అనేకమార్లు పట్టుబడినా వారిపై నామమాత్రపు కేసులే నమోదు చేశారు. అక్రమదందాకు ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవడం లేదు. రేషన్ బియ్యం, నిషేధిత పదార్థాలు అమ్ముతూ పట్టుబడినవారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు. అంటే వారు ఏ స్థాయిలో మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతోంది. అధికారుల చేతులు తడపడం వల్లే అక్రమార్కుల దందా కొనసాగుతోం



కల్తీ టీపొడి బ్యాగులు (ఫైల్)

అక్రమ వ్యాపారాలకు కేంద్రంగా..

వివిధ శాఖల అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతోనే పరిగిలో అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు, బెల్లం, కల్తీకల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, కలప, కల్తీ మటన్, చికెన్, చాయిపత్తి, గంజాయి, మత్తు పదార్థాల విక్రయం ఇలా అనేక రకాల వ్యాపారాలను అక్రమార్కులు పరిగి కేంద్రంగా కొనసాగిసున్నారు. పక్క జిల్లాల్లోని కొందరు వ్యాపారులు పరిగిని తమ అక్రమ వ్యాపారాలకు డెన్‌గా వాడుకుంటున్నారు. షాద్‌నగర్, కొడంగల్, వికారాబాద్, తాండూరు, చేవెళ్ల, మహమూబ్‌నగర్, శంకర్‌పల్లి, నారాయణపేట్,సదాశివపేట్, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలకు వస్తువుల అక్రమ రవాణా, ముడి సరుకుల ఎగుమతి ఇక్కడినుంచే కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా కట్టడి చేస్తే తప్ప ఈ అక్రమ దందాలకు చెక్ పడేట్టు లేదు.



ఇటీవల పట్టుబడిన పాడైన మటన్ (ఫైల్)



కులకచర్లలో పూర్తికాని సీసీ రోడ్డు పనులు

సా..గదీత!

● 'డబుల్ సీసీ' పనులు పూర్తయ్యేదెప్పుడో?

● వాహనదారులకు తప్పని ఇబ్బందులు

కులకచర్ల, మార్చి 23: కులకచర్ల చౌరస్తా నుంచి చౌడాపూర్ రోడ్డులోని పశువైద్యశాల వరకు సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు కిలోమీటర్ వరకు డబుల్ సీసీరోడ్డు పనులు చేపట్టి రోజులు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.3కోట్ల 60లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ ఒకవైపు సీసీ రోడ్డువేసి మరో పక్క కంకర వేసి వదిలేశాడు. దాంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పనులు ప్రారంభించి 22నెలలు గడుస్తున్నా సగం పనులు మాత్రమే పూర్తి చేశారు. రోడ్డుపైకి ఇసుక, మట్టి చేరడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవైపు రోడ్డును మాత్రమే రాకపోకలకు ఉపయోగించడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో రోడ్డుపై ఉన్న ఇసుక కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగినా స్పందించరా!

● పెద్దకాలువ కల్వర్టు వద్ద ప్రమాదకరంగా గుంత

● తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

పెద్దేముల్, మార్చి 23 : పెద్దేముల్ మండల కేంద్రం తాండూరు-కోట్‌పల్లి ప్రధానరోడ్డుపై పెద్దకాలువ కల్వర్టు వద్ద గుంత ప్రమాదకరంగా మారింది. అది ఏర్పడిన చోట రోడ్డుకిరువైపులా సైడ్‌బర్మ్ కూడా లేదు. రోడ్డుపక్కల మట్టి కూడా కోతకు గురైంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. ఘోర ప్రమాదం జరిగే అవకాశముంది. కాగా, ఇది డబుల్ రోడ్డు కావడంతో వాహనాలు వేగంగా వెళుతున్న సమయంలో గుంతను తప్పించబోయి.. కల్వర్టుపై నుంచి పెద్దకాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. నెలరోజుల క్రితం ఆర్టీసీ బస్సు కల్వర్టు సమీపంలో ఏర్పడిన గుంత వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో కల్వర్టును ఢీకొంది. డ్రైవర్‌అప్రమత్తంగా వ్యవహరించడంతో బస్సు కాలువలోకి దూసుకుపోకుండా ఆగిపోయింది. పలువురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా గుంతను పూడ్చాల్సిన అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుంతను కంకరతో బీటీవేసి మరమ్మతు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద రోడ్డుపై గుంత, కల్వర్టును ఢీకొన్న బస్సు (ఫైల్)


ఎన్నికల కోడ్.. ముమ్మర తనిఖీలు

వికారాబాద్, మార్చి 23 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు రద్దీప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలో ఎక్కడైనా మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలు రవాణా జరుగుతున్నట్లు అనుమానం ఉన్నా, డంపు చేసినట్లు తెలిసినా వెంటనే తమ పరిధిలోని పోలీస్ అధికారులకు లేదా 100కు ఫోన్ చేయాలని తెలిపారు.



వికారాబాద్ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పైలెట్.. పయనమెటు?



మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అడుగులు బీజేపీ వైపా.. కాంగ్రెస్ లోకా..!

బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరం!

తాండూరు: మార్చి 23: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పక్షం రోజులుగా ప్రజలకు, బీఆర్ఎస్‌పార్టీ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోతున్నారు. దీంతో అందరి దృష్టి పైలెట్‌పై పడింది. రోహిత్‌రెడ్డి అడుగులు ఎటు వైపు వేస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఆశించిన రోహిత్‌రెడ్డి ప్రస్తుతం ఆపదవి స్వీకరించేందుకు ఆసక్తి చూపడం లేదు. లిక్కర్‌స్కాంలో ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేసిన విషయం విదితమే. అయితే తాండూరులో మాత్రం ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టలేదు. కనీసం కవిత అరెస్టుపై ఖండన కూడా చేయలేదు. ఇటీవల తాండూరులో బీఆర్ఎస్ చేపట్టిన ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణపై నిరసనలు అంతంత మాత్రంగానే నిర్వహించారు. ప్రధాన ప్రతిపక్షంగా తాండూరులో అధికార పక్షాన్ని ఎండగట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటికీ రోహిత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. అయితే మొదట్లో రోహిత్‌రెడ్డి బీజేపీలో చేరేందుకు ఢిల్లీ పెద్దలతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఎమ్మెల్యేల ఎర కేసుకు సంబంధించి మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఘటన నేపథ్యంలో రోహిత్‌రెడ్డిని బీజేపీలో చేర్చుకోవడం సాధ్యమేనా అన్నదానిపై కూడా చర్చ జరుగుతున్నది. ప్రసుత్తం బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి అత్యంతసన్నిహితులు. రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యే చేయడంలో అప్పట్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. ప్రసుత్తం రాజకీయంగా ఇద్దరి మధ్య విభేధాలున్నాయి. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల విశ్వేశ్వర్‌రెడ్డి , రోహిత్‌రెడ్డి కలుస్తారా.. లేదా అన్నది సందేహం కలుగుతుంది. ఇక రెండో అంశం కాంగ్రెస్ పార్టీ తరపున తాండూరు ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన రోహిత్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి రోహిత్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సన్నిహితులు. రంజిత్‌రెడ్డి వీరిద్దరిని కాంగ్రెస్‌లో తీసుకొచ్చేందుకు సీఎం స్థాయిలో ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. తిరిగి కాంగ్రెస్‌లో చేరితే పార్టీ ఇమడగలమా.. కాంగ్రెస్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పని చేసేందుకు కార్యకర్తలు అంగీకరిస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. తనను ఓడించిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి పని చేస్తామా అన్నది రోహిత్‌రెడ్డి వర్గంలో ఇప్పటికే చర్చ జరుగుతుంది. ఇదిలా ఉంటే ఇప్పటికే రోహిత్‌రెడ్డి ప్రధాన అనుచరులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పైలెట్‌కు చెందిన 70 శాతం మంది కార్యకర్తలు, నేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్‌లో కొనసాగాలా.. వద్దా అన్న సందిగ్ధంలో పైలెట్ ఉన్నారు. ఈనెల 27న తాండూరులో నియోజవర్గస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రోహిత్‌రెడ్డి హాజరవుతారా.. లేదా.. అన్నది వేచిచూడాలి మరి!. అయితే పార్టీని వీడేది లేదని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చెబుతుండగా, కాలమే అన్ని నిర్ణయిస్తుందని మాత్రం ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి



ఖర్జూర గుత్తిని పరిశీలిస్తున్న అధికారి నీరజగాంధీ, ఏడీఏ సంజయ్‌కుమార్

కందుకూరు, మార్చి 23 : రైతులు వ్యవసాయంతో పాటు పట్ల తోటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా ఉద్యాన వన, పట్టు పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నీరజగాంధీ అన్నారు. శనివారం ఏడీఏ సంజయ్ కుమార్‌తో కలిసి సరస్వతి గూడలో పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో రైతులు పండ్ల తోటలకు క్రమం తప్పక నీటిని అందించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు. సరస్వతి గూడలోని రైతులు మల్బరి తోటలను పెంచుకుంటూ రోజూ లబ్ధి పొందుతున్నారని గుర్తు చేశారు. మల్బరి చెట్లకు వచ్చే పండ్లను ఉదయం మార్కెట్‌కు తరలించకుండా నగరం నుంచి వ్యాపారులు ఇక్కడికే వచ్చి కొంటుండంతో రైతులకు సమయం కలిసి వస్తోందని ఆమె రైతుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్‌రెడ్డి ఖర్జూర తోటను పరిశీలించారు. ఖర్జూర తోటల్లో అంతర పంటగా కూరగాయల సాగు కూడా చేపట్టవచ్చని అన్నారు. వారివెంట మండల ఉద్యానవన అధికారి సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

మనువాద వారసులను తరిమికొట్టాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

ఘట్‌కేసర్, మార్చి 23 : మనువాద వారసులను తరిమికొట్టేందుకు బుద్ధి జీవులంతా ఏకం కావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో మాలమహానాడు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు మూల స్తంభాలుగా బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాస్తే.. కొందరు దాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. నేడు కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌళిక సూత్రాల పునాదులు ధ్వంసమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవించే హక్కును, మాట్లాడే స్వేచ్ఛను కోల్పోతున్నామన్నారు. ఇలాంటి ఫాసిస్టు పాలన ప్రజలను కులాలు, మతాలుగా విడగొడుతూ మనువాద వారసత్వాన్ని అమలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను, సహజ వనరులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లపరం చేస్తున్నదని ఆరోపించారు. ఆహార అలవాట్లపై జాతీయవాదం పేరుతో దళిత, మైనార్టీ వర్గాలపై జరిగిన దాడుల నుంచి మణిపూర్‌లో గిరిజన మహిళలను వివస్త్రలను చేసిన సంఘటనల వరకు రాజ్యాంగ హక్కులను కేంద్రం కాలరాస్తూనే ఉందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కావాలని, సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతన్నలు ప్రజాస్వామిక పోరాటాన్ని సాగిస్తే వారిని అణిచివేసిందని, కొందరిని బలిగొన్నదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పే వరకు తెగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం మాలలకు తగిన ప్రాముఖ్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, జాతీయ ఉపాధ్యక్షులు ఎం.బాబురావు, భాస్కర్, సత్యనారాయణ, అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్పల నర్సింగరావు, శ్రీరాములు, పురుషోత్తం, వెంకటస్వామి, రవికాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం మహేష్, వైస్ ప్రెసిడెంట్ అంజనేయులు, మల్లేష్ మురళి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

'కాసాని'ని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కన చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

పరిగి, మార్చి 23 : బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి సబితారెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, రాజేంద్రనగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ వాణీదేవి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌లు పాల్గొన్నారు. సబితారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీ స్థానాన్ని మాజీ సీఎం కేసీఆర్ చాలెంజ్‌గా తీసుకున్నారని, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కూడా అదే స్ఫూర్తితో పనిచేసి జ్ఞానేశ్వర్‌ను భారీగా మెజార్టీతో గెలిపించేలా పని చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వంద రోజుల్లో ఏం చేశాడని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాగానే కరెంట్ పాయే.. కరువొచ్చెనని అన్నారు. రైతు రుణమాఫీ, రూ.4,000 పింఛన్ ఏమైందని అన్నారు. బీజేపీకి జైశ్రీరాం, కాంగ్రెస్‌కు కండువాలు మార్పించుడు తప్పా మరోటి లేదన్నారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తాను జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా జిల్లాకు ఎంతో సేవ చేశానని, ఎంపీగా అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా జ్ఞానేశ్వర్‌ను పంపించాడని, చాలెంజ్‌గా తీసుకుని గెలిపించుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. పదేళ్లలో ఎంతో సేవ చేశామని, ఒక్కసారి అధికారం కోల్పోతే బాధపడాల్సిన అవసరం లేదని అన్నారు.

మీ కర్మ.. పోయేవాళ్లు పోండి

మీ కర్మ... పోయేవాళ్లు పోండి.. మేము కేసీఆర్ వెంటే ఉంటాం.. అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై ప్రకాశ్‌గౌడ్ ఫైర్ అయ్యారు. రాజకీయాల్లోని రంజిత్‌రెడ్డిని ఎంపీగా పార్లమెంట్‌కు పంపిస్తే.. ఇప్పుడు కష్టాల్లో ఉన్న పార్టీని వీడేందుకు మనసు ఎలా ఒప్పిందంటూ ప్రశ్నించారు. ఈ రోజు మన పార్టీ ఓడిపోయింది. అంతమాత్రాన పార్టీ గురించి తక్కువగా మాట్లాడితే మంచిది కాదని, మనల్ని నమ్ముకున్నప్పుడు, మనం కేసీఆర్‌ను నమ్ముకుని పార్టీకోసం పనిచేయాలని కోరారు. కలిసికట్టుగా పనిచేసి కాసానిని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. పార్టీని నుంచి పోయినవాళ్ళకు బుద్ధి చెప్పాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. నమ్ముకున్న వ్యక్తి పార్టీని వదిలి వెళ్ళిపోతే ఎలా? అని ప్రశ్నించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు నియోజకవర్గాలో నలుగురం ఎమ్మెల్యేలం ఉన్నాం. మిగతా మూడు నియోజకవర్గాల్లో కూడా పార్టీ బలంగా ఉంది. అందరూ సమిష్టితో పనిచేస్తే గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు వీరేశ్‌ముదిరాజ్, మునిసిపల్ చైర్మన్ అశోక్, ఎంపీపీలు అరవింద్‌రావు, మల్లేశం, జడ్పీటీసీలు నాగిరెడ్డి, హరిప్రియరెడ్డి, ఎంపీ పీలు మేఘమాల, రాందాస్ నాయక్, శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'ప్రజాపాలన'తో పెరిగిన విశ్వాసం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



పార్టీలో చేరిన ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి 23 : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం ఏర్పడిందని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలు గెలుపొందడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకతను గ్రహించిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఉనికి కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వెల్దండ ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్, పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు ఎంపీపీతో పాటు నాయకులకు పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్‌తో కలిసి కసిరెడ్డి పార్టీ కండువాలు కప్పారు. అనంతరం కసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా రంజక పాలన సాగిస్తుందని.. అందుకే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికార దాహంతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ మత రాజకీయాలు సాగిస్తుందని మండిపడ్డారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సంజీవ్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ వెంకటమ్మ, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

కసిరెడ్డిని కలిసి ఫరీద్

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎండీ ఫరీద్ శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఫరీద్‌ను కసిరెడ్డి సత్కరించి అభినందించారు.

అలరించిన సంగీత విభావరి

- సంగీతంలో ఓలలాడించిన 'అరుణ సాయిరాం' ● సత్యధామంలో మిన్నంటిన హర్షధ్వానాలు



సంగీత్ ఉత్సవ్‌లో పాల్గొన్న ప్రేక్షకులు, భక్తులు



గేయాలను ఆలపిస్తున్న అరుణ సాయిరాం

సదాశివపేట, మార్చి 23 : భారత సాంప్రదాయ సంగీత గాయని, కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమీ ఉపాధ్యక్షురాలు అరుణ సాయిరాం సంగీత విభావరి అలరించింది. మర్పల్లి మండలం బిల్‌కల్ గ్రామ శివారులో గల (సత్యధామ్) సత్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో శనివారం సత్యధామ్ వ్యవస్థాపకులు ఎం.వి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంగీత్ ఉత్సవ్'లో ప్రఖ్యాత సంగీత కళాకారిణి అరుణ సాయిరాం తన గాత్రంలో పలువురు వాగ్గేయకారుల కృతులను ఎంతో శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. గణేశ కృతి, రంగపుర విహారా, గోవిందా గోవిందా, త్యాగరాజ కృతులు, ముత్తుస్వామి దీక్షితర్, రామ నీనామమే రుచిరా, శ్రీ సత్యనారాయణ, బంతురితువ్వ వినయ రామ వంటి గేయాలను సంగీత కృతులతో 'అరుణ సాయిరాం' శ్రావ్యంగా గానం చేసి ఆహుతులను అలరించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పద్మశ్రీ అరుణ సాయిరాం దక్షిణ భారతీయ సంగీతంలో అత్యంత ప్రసిద్ధ స్వరాలలో ఒకరిగా ప్రశంసించబడ్డారన్నారు. అదే సమయంలో స్వరకర్త, సహకారి, గురువు, మానవతావాది, పరోపకారి, వక్తగా గుర్తింపు పొందారన్నారు. ఆమె సంగీతం విద్వాంసులను, వాగ్గేయకారులను, సామాన్యులను ఆకర్షించిందన్నారు. బ్రిక్స్ వార్షిక గుర్తింపు అవార్డు 2023-24, ఇండియా టుడే 2023-24 అవార్డు, భారతదేశపు టాప్ 100 మహిళా అచీవర్స్‌లలో అరుణ సాయిరాం ఒకరిగా నిలిచారన్నారు. 2023లో ఫ్రాన్స్ ప్రభుత్వం 'అరుణ'కు ప్రతిష్ఠాత్మకమైన 'చెవాలియర్ అవార్డు'ను ప్రదానం చేసిందన్నారు. ఇది ఆమె సాధించిన అసాధారణ విజయం అని ఆయన కొనియాడారు. దక్షిణ భారతీయ సంగీతం ఓ ఆధ్యాత్మిక అన్వేషణ, ఒక తాత్విక ప్రయాణం, పారవశ్యం అయితే అరుణ సాయిరాం ఓ సంగీత కళానిధి అని అన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- ఐసీడీఎస్ సీడీపీవో రోజా ● ఘనంగా పోషణ పక్షోత్సవం ● పౌష్టికాహారంపై అవగాహన



పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీపీవో రోజా

ఆమనగల్లు, మార్చి 23 : మహిళల భద్రత, సంరక్షణ, సాధికారితకు ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో రోజా అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్‌లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, పోషణ పక్షోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీడీవో పారుఖ్‌హుస్సేన్, మెడికల్ ఆఫీసర్ విజయలు హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో కలిసి సీడీపీవో రోజా జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యువతులు, విద్యార్థినులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోషణ పక్షోత్సవంలో భాగంగా చిరుధాన్యాలు, విటమిన్లు కలిగిన ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. రోజా మాట్లాడుతూ బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎస్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

భూకైలాస్‌లో శనిత్రయోదశి పూజలు



తాండూరు రూరల్, మార్చి 23 : శనిత్రయోదశిని పురస్కరించుకుని అంతారం భూకైలాస్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని శనైశ్చరునికి శనివారం అర్చకులు రవిశంకర్‌స్వామి, బిచ్చయ్య, జగదీష్, ఆనంద్‌స్వామి తైలాభిషేకం, పండ్లు, జిల్లేడు పూలు, ఆకులతో పూజలు చేసి అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



క్యాంటీన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మల్లారెడ్డి వర్సిటీలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

మేడ్చల్ టౌన్, మార్చి 23 : అన్నంలో పురుగులు వస్తున్నాయంటూ గత కొద్ది రోజులుగా మల్లారెడ్డి యూనివర్సిటీ బాలికల హాస్టల్ విద్యార్థులు చేపడుతున్న ఆందోళనల పై ఎట్టకేలకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు, సమాఖ్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ కమిటీ సభ్యులు శనివారం యూనివర్సిటీలోని హాస్టల్‌ను సందర్శించి తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు హాస్టల్ క్యాంటీన్‌లో పెడుతున్న భోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం టిఫిన్లు, మధ్యాహ్న భోజనం, రాత్రి డిన్నర్‌లో పెడుతున్న ఆహార పదార్థాల గురించి సభ్యులు తెలుసుకున్నారు. హాస్టల్ నిర్వహణలో భాగంగా తగిన ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అనే విషయాలు తెలుసుకున్నారు. తనిఖీల్లో సమాఖ్య హ్యూమన్ రైట్స్ జాతీయ కమిటీ చైర్మన్ సాయికుమార్ గౌడ్, ఈసీ వినయ్‌కుమార్, శివ చరణ్ సింగ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ డబ్బుల కోసం దాష్టీకం

- అప్పు తీసుకున్న వ్యక్తిని చితకబాదిన వైనం
- వ్యక్తిపై కేసు నమోదు

తాండూరు, మార్చి 23 : తీసుకున్న డబ్బులకు వడ్డీ చెల్లించలేదని ఓ వ్యక్తి దాష్టీకానికి పాల్పడ్డాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి చేతులు కట్టేసి కాలితో తన్నుతూ పిడిగుద్దులు గుద్దాడు. కుటుంబ సభ్యులతో ఆ తతంగం అంతా వీడియో తీయించాడు. అది కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తాండూరు పట్టణం రాజీవ్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ బాలయ్య అదే పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మ్యాదరి రవి అనే వ్యక్తి వద్ద మూడు నెలల క్రితం రూ.5వేలు అప్పు తీసుకున్నాడు. దీనికి నెలకు రూ.500 వడ్డీ చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, మూడు నెలలకు కలిపి మొత్తం రూ.6500 అయ్యింది. అయితే, తీసుకున్న డబ్బు, వడ్డీ ఇవ్వడం లేదని.. శుక్రవారం రవి బాలయ్యను తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం అతడిని చితకబాదాడు. ఈక్రమంలో వీడియో కూడా తీయించాడు. సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయ్యింది. దాంతో బాధితుడు పట్టణ పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.

మంత్రిగా మల్లారెడ్డి చేసిందేమీ లేదు

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట, మార్చి 23 : మంత్రిగా ఐదేళ్ల పనిచేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గాన్ని నిలువు దోపిడీ చేసిన మల్లారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గానీ, నాయకులను గానీ ఏమీచేయలేడని ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని తూంకుంటలో గల మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మల్లారెడ్డి మంత్రిగా పనిచేసి నియోజవర్గానికి ఒక్క డిగ్రీ కళాశాల కూడా తేలేకపోయాడాని, దొంగలతో చేతులు కలిపి అంతులేని అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. నియోజవర్గంలోని మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్‌లకు రోడ్లు వేయలేకపోయాడని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మేడ్చల్, శామీర్‌పేట రోడ్లకు ఆర్మీని ఒప్పించి ఆరు లేన్ల రోడ్లను మంజూరు చేయించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. అనుమతులను తీసుకోకుండానే మల్లారెడ్డి కళాశాల, ఫంక్షన్‌హాళ్ల భవనాలను నిర్మించడం దారుణమని అన్నారు. మల్లారెడ్డితో పాటు ఆయన అల్లుడు, కుమారుడు సుద్దపూసలేనని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో బీఆర్‌ఎస్ ఓడిపోయి భూస్థాపితం కావడం, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పట్నం సునీతారెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, తొడగొట్టడాలు గుర్తున్నాయని, అందుకు మల్లారెడ్డి మూల్యం చెల్లించక తప్పదని, నోరు అదుపులో పెట్టుకొని ఉండాలని హితవు పలికారు. నియోజకవర్గంలో ఎన్నో చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారని మల్లారెడ్డిపై ధ్వజమెత్రాడు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వైఎస్ గౌడ్, నాయకులు మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, బాలేష్, మహేందర్‌యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నేడు(ఆదివారం) ఉదయం 10 గంటలకు మేడ్చల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు వజ్రేష్‌యాదవ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రానున్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్ష కేంద్రంలోకి ప్రభుత్వ టీచర్ అక్రమ ప్రవేశం

- పరీక్ష నిర్వాహకులను విధుల నుంచి తప్పించిన డీఈవో
- రంగారెడ్డి జిల్లా కేశంపేటలో ఘటన

షాద్‌నగర్, మార్చి 23 : కేశంపేట మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్రమంగా ప్రవేశించడం కలకలం రేపింది. దీనిపై చర్యగా జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ కృష్ణయ్యలను విధుల నుంచి తప్పించారు. వివరాల్లోకి వెళితే.. కేశంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం గణిత శాస్త్రం పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఇదే మండలం నిడుదవెల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేశంపేట పరీక్ష కేంద్రం వద్దకు కారులో వచ్చాడు. అయితే, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ అతడిని గమనించి అడ్డుకోవడంతో తాను ఉన్నతాధికారినంటూ సమాధానం చెప్పాడు. అనంతరం నేరుగా పరీక్ష కేంద్రంలోనికి వెళ్లాడు. ఈ విషయమై వెంటనే కానిస్టేబుల్ జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశాడు. దీనిపై డీఈవో పూర్తి వివరాలు సేకరించారు. పరీక్ష మొదలైన తర్వాత బయటి వ్యక్తులు ఎవరూ పరీక్ష కేంద్రంలోకి వెళ్లే అనుమతి లేదు. దీంతో ఎగ్జామ్ సెంటర్ సూపరింటెండెంట్ నర్సింహులు, డీవో కృష్ణయ్యలను విధుల నుంచి తప్పించారు. కాగా, షాద్‌నగర్‌లోని కుంటబడికి చెందిన రాజశేఖర్ అనే ఉపాధ్యాయుడిని కేశంపేట పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా, మొగిలిగిద్ద పాఠశాలకు చెందిన భరత్ అనే మరో ఉపాధ్యాయుడిని డీవోగా నియమించారు.

చిల్డ్రన్స్ కప్ అండర్-9 చెస్ విజేతలు అభినవ్, నిత్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి) మార్చి 23 : వరాస్ చెస్ అకాడమీ చిల్డ్రన్స్ కప్ అండర్-9 బాలుర కేటగిరీలో బి.శ్రీఅభినవ్, బాలికల విభాగంలో కె.నిత్య విజేతలుగా నిలిచారు. ఈమేరకు శనివారం నగరంలోని ఉప్పల్‌లో గల వరాస్ చెస్ అకాడమీలో ప్రారంభమైన ఈ పోటీల్లో బాలుర అండర్-9 విభాగంలో అభినవ్ టైటిల్ కైవసం చేసుకోగా, నారాయణ రన్నరప్‌గా నిలిచాడు. బాలికల అండర్-9 కేటగిరీలో నిత్య, అండర్-11లో అనికారెడ్డి టైటిళ్లు సాధించారు. బాలుర అండర్-11లో ఆద్యాన్ విజేతగా నిలవగా, ధీరజ్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకున్నాడు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



రోల్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్, మార్చి 23 : క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని డెకత్లాన్ స్పోర్ట్ కాంప్లెక్ ప్రాంగణంలో శనివారం అండర్ 16 రోల్‌బాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అన్ని క్రీడా పోటీల్లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నీరటి రాజు, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తున్న మోదీ : సీపీఎం



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 23: కేంద్రంలో మోదీ ప్రభుత్వం బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతిపక్ష పార్టీలను టార్గెట్ చేస్తూ కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేయిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామ్యేల్ ఆరోపించారు. వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు మోదీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐలను తమ జేబు సంస్థలుగా ఉపయోగించుకుంటూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితల అరెస్టులు కూడా ఇందులో భాగమేనని ఆయన ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు పురుషోత్తం, ఆనంద్, ముసలయ్య, గణేష్, విఘ్నేష్, బుగ్గరాములు, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)-హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటుచేసిన ఫ్లాగ్‌షిప్ పబ్లిక్ పాలసీ కాన్‌క్లేవ్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రసంగించారు.

విద్యార్థి మృతికి కారణమైన
హెచ్‌ఎం, టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, మార్చి 23: విద్యార్థి మృతికి కారణమైన హెచ్‌ఎం, టీచర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువు తున్న ఆర్కతల గ్రామానికి చెందిన విద్యార్థి కార్తీక్‌తో క్యాన్‌లో తాగునీటిని తీసుకురావాలని ఉపాధ్యాయుడు బైక్ ఇచ్చి బయటకు పంపించడంతో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విధితమే. పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని బయటకు పంపించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం, టీచర్ ఇద్దరిపై కేసు నమోదు చేయాలని మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులుకు శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గతంలో మీనపల్లి కలాన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను బయటకు పంపించడంతో ఓ విద్యార్థి బైక్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో మంచానికే పరిమితమయ్యాడని గుర్తు చేశారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా ఎంఎస్‌పీ నాయకుడు రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, బద్రీ, నర్సింహ, జనార్దన్, మోమిన్‌పేట్ నాయకులు అనంతయ్య, రాములు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రవీందర్

పూడూరు, మార్చి 23 : బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా మండలంలోని కంకల్‌కు చెందిన రవీందర్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి నియామకపత్రంలో పేర్కొన్నారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరించి, పార్టీ కమిటీలతో కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల సమస్యలను గుర్తించాలని సూచించారు.

విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

● తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 23: రాష్ట్రంలో వివిధ కుల సంఘాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన విధంగా విశ్వకర్మలకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మంగారి గుట్ట వద్ద ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. విశ్వకర్మ సంఘం సభ్యులకు రాజకీయంగా వివిధ నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చారు. విశ్వకర్మ కులస్థులు జగత్‌కు సృష్టికర్తలని అన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా విశ్వకర్మలు చేసేపనికి ఉండే గుర్తింపు ప్రత్యేకమైనదన్నారు. గతంలో నిర్మించిన ఆలయాలు, కోటల నిర్మాణాలు విశ్వకర్మలు చెక్కిన కళా నైపుణ్యం, గొప్పదని అన్నారు. బ్రహ్మంగారి గుట్టకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుతో పాటు ప్రభుత్వం తరఫున అదేవిధంగా తాను సొంతంగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. త్వరలో తాండూరులో టాటా కన్సల్టెన్సీ స్కిల్స్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో విశ్వకర్మ సంఘం వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. సంఘం సలహాదారు సీనియర్ న్యాయవాది కరుణం పురుషోత్తం రావు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ఎప్పుడు నిర్మించినా తన వంతు ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. గతంలో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ద్వారా ఈ సంఘానికి విలువైన స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస్ చారి, విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జ శ్రీనివాస చారి, సంఘం ప్రతినిధులు వడ్ల శ్రీనివాస్ చారి, ఆనంద్‌చారి, పొలేందర్ చారి, తిప్పన చారి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సంఘం ప్రతినిధులు ఘజమాలతో సన్మానించారు.

సంగెం కుర్దు ఆలయ సందర్శన

యాలాల: యాలాల మండల పరిధిలోని సంగెం కుర్దు గ్రామ సమీపంలో గల సంగమేశ్వర ఆలయాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ పక్కనే గల శనీశ్వర దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాలుడిపై కుక్కదాడి.. చికిత్స పొందుతూ మృతి



ప్రవీణ్ (ఫైల్)

శామీర్‌పేట, మార్చి23: కుక్క దాడి చేయడంతో గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేటలో చోటుచేసుకుంది. స్థానిక పెద్దమ్మ కాలనీకి చెందిన బాలు మేస్త్రీకి ముగ్గురు పిల్లలు. ఈనెల 18న బాలు పెద్ద కుమారుడు ప్రవీణ్(11) ఇంటి ముందు ఉండగా కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రభుత్వ కోరంటి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. బాలుడి మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి వ్యక్తి..



మృతుడు శివశంకర్

తాండూరు, మార్చి 23: ప్రమాదవశాత్తు రైలుకింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన తాండూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. మండలంలోని పాత తాండూరుకు చెందిన అన్నదాత ఫర్టిలైజర్ వ్యాపారి కనకం శివశంకర్(58) శుక్రవారం పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి రావడానికి శుక్రవారం రాత్రి 11గంటలకు ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. తాండూరు రైల్వేస్టేషన్ రాగానే రైలు కదులుతుండగానే దిగడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

తాండూరు రూరల్, మార్చి 23: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి పలువురిని పట్టుకున్నారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చంద్రవంచ గ్రామశివారులో కొందరు పేకాడుతున్నట్లు కరన్‌కోట్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి వెళ్లి చూడగా ఐదుగురు వ్యక్తులు పేకాడుతూ పట్టుబడ్డారు. వారి వద్దనుంచి రూ.11,560ల నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధిక లోడ్‌తో వెళుతున్న లారీలకు జరిమానా



పట్టుబడిన అధిక లోడ్‌తో వెళుతున్న లారీలు

తాండూరు రూరల్, మార్చి 23: అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలు, టిప్పర్లకు అధికారులు జరిమానా విధించారు. మండలంలోని కరన్‌కోట్ పోలీసులు విధుల్లో భాగంగా శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అధిక లోడ్‌తో వస్తున్న ఆరు లారీలు, ఇతర వాహనాలను ఆపి తనిఖీ చేశారు. వాటిలో అధిక లోడ్ ఉండటంతో ఆర్టీవో అధికారుల వద్దకు పంపారు. వాటిలో రెండు టిప్పర్లు అధిక లోడ్ ఉన్నట్లు గుర్తించి రూ.25వేల జరిమానా విధించినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అధిక లోడ్ వాహనాలు నడపరాదని ఎస్‌ఐ సూచించారు.

భర్త రెండో పెళ్లికి సిద్ధమయ్యాడని భార్య ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23: తన భర్త రెండో పెళ్లికి సిద్ధమయ్యాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ, బాధితురాలు కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన డెంటల్ డాక్టర్ శోభారాణి, హన్మకొండకు చెందిన సందీప్‌చౌహాన్‌తో 2009లో వివాహమైంది. వివాహ సమయంలో శోభారాణి తల్లిదండ్రులు సందీప్‌చౌహాన్‌కు వివిధరూపాల్లో కట్నకానుకల కింద రూ.50లక్షల వరకు ముట్టజెప్పారు. వీరికి 2011లో కూతురు పుట్టింది. అప్పటి నుంచి సందీప్ భార్య, కూతురు నానాఇబ్బందులకు గురిచేస్తుండటంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా కలిసి ఉండాలని సర్దిచెప్పి పంపారు. అయినా సందీప్ ప్రవర్తనలో మార్పురాలేదని భార్య శోభారాణి ఆరోపించింది. దీంతో తన కూతురితో కలిసి తండ్రి వీరభద్రయ్య వద్ద ఉంటోంది. ఈనెల 24న భర్త సందీప్‌చౌహాన్ రెండో పెళ్లి చేసుకుంటున్నడానే విషయం తెలుసుకొని శోభారాణి తండ్రి వీరభద్రయ్య, కూతురితో కలిసి శుక్రవారం రాత్రి పోచారం మున్సిపల్, అన్నోజిగూడలో అరుణద్వారక ఓయోహోటల్ నిర్వహిస్తున్న సందీప్‌చౌహాన్ వద్దకు వచ్చి నిలదీశారు. దీంతో శోభారాణి, వీరభద్రయ్యలపై దాడిచేసి సందీప్‌చౌహాన్ అక్కడి నుంచి పారిపోయాడు. తనకు న్యాయం చేయాలని శోభారాణి పోచారం ఐటీసీ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

వికారాబాద్, మార్చి 23: రైలులో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి జీఆర్పీ, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఆర్పీఎఫ్ సంయుక్తంగా నిర్వహించగా అర్ధరాత్రి దాటాక గోవా నుంచి జైసిద్ వెళ్తున్న వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైల్లో తనిఖీ చేశారు. ఈ క్రమంలో రెండు బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న 25మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ బస్తాలు ఎవరివనేది విచారణ చేయగా ఎవరూ ముందుకు రాలేదు. పోలీసులను గమనించి నిందితులు మద్యం సీసాలను అక్కడే వదిలేసి తప్పించుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23: గుట్టుచప్పుడు కాకుండా కోళ్లపందేలు కోడిపందాలు ఆడుతున్న నలుగురిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లో శుక్రవారం రాత్రి మోడీబిల్డర్స్ నిర్మాణుష ప్రదేశంలో అదేగ్రామానికి చెందిన అన్నంపురెడ్డి రవి, బండారి శ్రీను, ముద్దినేని కృష్ణంరాజు, మారెళ్ల చాణిక్యరాజులు కోడిపందేలు ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1600నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎస్ఐఆర్-ఐఐసీటీతో
అనురాగ్ యూనివర్సిటీ సహకార ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న యూనివర్సిటీ సీఈవో నీలిమా, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23: సీఎస్ఐఆర్, ఐఐసీటీ అనురాగ్ యూనివర్సిటీ సహకార ఒప్పందంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం సీఎస్ఐఆర్, ఐఐసీటీతో అనురాగ్ యూనివర్సిటీ సహకార ఒప్పందం(ఎంవోయు) కుదుర్చుకున్నారు. సీఎస్ఐఈఆర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా, రిజిస్ట్రార్ జాలాజీ ఉట్ల ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే భారత్‌కు ప్రత్యేక గుర్తింపు



సంప్రదాయ దుస్తుల్లో కళాశాల విద్యార్థులు

మేడ్చల్‌టౌన్, మార్చి 23: అనేక సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయంగా ప్రపంచంలోనే భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ. రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంప్రదాయ సంగమం 2కే24 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు భారత్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ దుస్తులను ధరించి నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా టీవీ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు మన సంస్కృతి, ఆచారాలు, కట్టుబాట్లను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వెంకట్, ఐక్యూ ఎసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. భాస్కర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ పాల్గొన్నారు.

భారతజాతి మెచ్చిన బిడ్డ నరేంద్రమోదీ



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్ మార్చి 23 : భారతజాతి మెచ్చిన బిడ్డ ప్రధాని నరేంద్రమోదీ అని అందుకే 2014, 2019లో భారీ మెజార్టీతో గెలిపించారని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. మేడ్చల్ పట్టణంలో కేఎల్లార్ వెంచర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన విజయ సంకల్పయాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత్‌కు పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన ఘనత ప్రధాన నరేంద్రమోడీదని గుర్తుచేశారు. మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. అనంతరం నారెడ్డి నందారెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

మర్పల్లి, మార్చి 23: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భట్టు లలిత రమేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ భట్టు లలిత రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే రోజుల్లో వేసవి ఎండలు తీవ్రతరం కానున్నాయని, గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ అధికారులు, ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అంతకుముందు విద్యుత్ శాఖ సమీక్షలో విద్యుత్ అధికారులు సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతుందని ఎంపీటీసీ బాల్‌రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. సపోర్ట్ తీగలకు విద్యుత్‌సరఫరా కావడంతో మూగజీవాలతో పాటు ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు సమాధానం ఇచ్చారు. మిగతా శాఖల సమీక్షను నామమాత్రంగా నిర్వహించి తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించారు.

హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తాండూరురూరల్, మార్చి 23: సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులు హోంఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వో (బూత్ లెవల్ అధికారుల)కు శనివారం ఎన్నికల కోడ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 85ఏళ్లు పైబడిన వృద్ధులు, 40శాతం అంగవైకల్యం ఉన్న వారు ఫాం-12(డీ) ద్వారా హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు సంబంధిత ఓటరు ఇంటికి వెళ్లి బీఎల్‌వోలు దరఖాస్తు ఫారాలను అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఏప్రిల్ 1నాటికి 18ఏళ్లు నిండిన యువతీ యువకులంతా కొత్త ఓటు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అట్టి దరఖాస్తులు ఏప్రిల్ 18వ తేదీ వరకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, గిర్దావర్ బాల్‌రాజ్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ధారూరులో
పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు

ధారూరు, మార్చి 23: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, వేరుశనగ, మొక్కజొన్న పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు నిర్వహించారు. కందులు 50 క్వింటాళ్లు, వేరుశనగ 15 క్వింటాళ్లు, మొక్కజొన్న 152 క్వింటాళ్ల మార్కెట్‌లో విక్రయాలు జరిగాయని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. కందులు క్వింటాలు రూ. 10,200ల నుంచి 10,400లు, వేరుశనగ క్వింటాలుకు రూ. 6,300 నుంచి 6,900లు, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,175 నుంచి రూ. 2,270 వరకు ఖరీదుదారులు బీట్లలో ధర పలికి కొనుగోలు చేశారని ఆమె చెప్పారు.

సీఎంను కలిసిన
కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి బసవేశ్వర విగ్రహాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొడంగల్ రూరల్, మార్చి 23: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, సత్తిరెడ్డి, మల్లేశ్ తదితరులు సీఎంను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పెద్దనందిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లేశ్ సీఎంకు బసవేశ్వర విగ్రహాన్ని అందించారు.

రైతు సేవా సహకార సంఘం
అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎదులాబాద్ సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి శనివారం జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. వ్యవసాయ భూమి లేకుండానే సభ్యత్వం కల్గిన ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రామిరెడ్డిని అనర్హునిగా ప్రకటించాలని, చైర్మన్ అయిన తరువాత తన కూతురి వ్యవసాయ భూమిని గిఫ్ట్‌డీడ్ చేసుకున్నారని ఇది నిబంధనలకు విరుద్ధమని తెలినప్పటికి అతనిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఫిర్యాదులు చేసిన పట్టించుకోవాలేదన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పరిగి,మార్చి 23: పరిగి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (ఆదివారం) విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. పరిగి మునిసిపాలిటీ, సుల్తానగర్, లక్ష్మీదేవిపల్లి, నస్కల్, బర్కత్‌పల్లి, రుకుంపల్లి, బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నజీరాబాద్, న్యామత్‌నగర్, మాదారం పేటమాదారం గ్రామాలతోటు, పరిశ్రమలకు ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులకు సహకరించాలని ఆయన కోరారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాడుదాం



కొడంగల్: భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కొడంగల్, మార్చి 23: భగత్‌సింగ్ ఆశయసాధనకు పోరాడుదామని రెవల్యూషన్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమా రాజు అన్నారు. ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం కొడంగల్ పట్టణంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ యూనియన్ నాయకులు వెంకటేశ్, భరత్, విక్కి, భూమిక, ప్రమీల, అనురాధ, భావన, అనూష, శ్వేత, రమ్య, కావేరి పాల్గొన్నారు.

పరిగి: ప్రధాని మోదీ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. పరిగిలో శనివారం మహనీయులు భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పరిగిలో జరుపుకున్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హబీబ్,సత్తయ్య,రాముురాం, ఆసీఫ్, లాలయ్యలు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా శనివారం సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొడంగల్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఎండీ. మహిమూద్, ఇందనూర్ బషీర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మూతుల రాజు, మల్లప్ప, ఎండీ.ముస్తఫా, లక్ష్మణ్, ఎండీ. ఖలీల్, శ్రావణ్, రాజు, భీములు, అనిల్ కుమార్, బిచ్చప్ప, శేఖర్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరయాంజాల్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, శంకర్ గౌడ్, మురళిగౌడ్, ధర్మారెడ్డి, రాజు, శ్రీనివాస్ యాదగిరి తదితర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ చైతన్యంలో భాగంగా ఈనెల 27న ఉదయం 6గంటలకు 5కే రన్ నిర్వహిస్తున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. 100శాతం పోలింగ్ జరిపేందుకు చైతన్యవంతం చేయడంలో భాగంగా ఇందిరా చౌక్ నుంచి సెయింట్ మార్క్స్ హైస్కూల్ ప్రాంగణం వరకు తిరిగి అక్కడి నుంచి ఇందిరా చౌక్ వరకు ఈ రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

● **కులకచర్ల:** పటేల్ చెరువు తండా పంచాయతీ పరిధిలోని మంచికుంట తండాలో బాణవత్ రిక్కిబాయి, సోమ్లనాయక్ కూతురు గంగ వివాహానికి మాజీ సర్పంచ్ శాంతి తులసీరామ్ శనివారం పెళ్లి కానుకను అందజేశారు. క్వింటాలు సోనా బియ్యం, 15 కేజీల మంచి నూనె డబ్బా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏ కవిత, ఉమ్లానాయక్, లక్ష్మీ రామునాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** మండలంలోని కామునిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కారక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలు, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

● **పరిగి:** సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని నస్కల్‌లోని కేజీబీవీలో షీటీం ఆధ్వర్యంలో శనివారం సైబర్‌క్రైం, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యురాలు శోభారాణి పాల్గొన్నారు.

● **వికారాబాద్:** వికారాబాద్‌లోని కొత్తగంజ్ హనుమాన్ దేవాలయంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. శనివారం సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

● **పెద్దేముల్:** మంబాపూర్ గ్రామంలో కొత్తగా ఏర్పడిన ఎస్సీకాలనీలో జనాల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేందుకు మురుగుకాలువపై నుంచి వాహనాలు కూడా వెల్లగలిగే విధంగా కల్వర్టును ఏర్పాటు చేశారు. అయితే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నాలుగురోజుల కిందట కల్వర్టును సగం తొలగించారు. కల్వర్టును తొలగించిన చోట పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో దగ్గర నుండి వెళితే కరెంటు షాక్ తగులుతుందేమోనని జనం భయపడుతున్నారు. అయితే కల్వర్టును ఎవరు తొలగించారు. ఎందుకు తొలగించారనే విషయం తెలియడం లేదు. కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందన లేదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమగురుకుల మహిళా డిగ్రీ కళాశాల (ఇబ్రహీపట్నం)లో రాజనీతిశాస్త్రం, చరిత్ర, జర్నలిజం సబ్జెక్టులు బోధించడానికి అధ్యాపకుల కావాలనని ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఎం.ఎ పూర్తి చేసి ఉండాలని, నెట్, సెట్ ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డెమో, ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (ఇబ్రహీపట్నం)కు హాజరుకావాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9121004526 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.


● **పెద్దేముల్:** మంబాపూర్‌లో రోడ్డుపక్కల డ్రైనేజీని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా మారుస్తున్నారు. వారంరోజుల నుండి పనులు చురుకుగా సాగుతున్నాయి. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో గ్రామం నుంచి రుక్మాపూర్ వెల్లే రోడ్డులో జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డుపై డ్రైనేజీని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా మార్చాలని గత పంచాయతీ పాలకవర్గం అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ ఈ మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జాతీయ ఉపాధిహామీ పథకం నుండి రూ.5లక్షలు మంజూరు చేశారు. కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక పనులు వేగంగా సాగుతుండడంతో తమ ఇబ్బందులు తీరుతున్నాయని కాలనీవాసులు, విద్యార్థులు నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

● **వికారాబాద్:** ఎల్లకొండలో వారం రోజులుగా కొనసాగుతున్న జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పి.భరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రావుగారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● **యాలాల:** పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని యాలాల ఎస్‌ఐ శంకర్ అన్నారు. శనివారం ఆయన అగ్గనూర్ , యాలాల, పరీక్ష కేంద్రాల్లో పోలీసుల బందోబస్తును పరిశీలించారు.

● **కొడంగల్:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తదితర అంశాలపై తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కొడంగల్ మండలంలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

వాహన తనిఖీలు ముమ్మరం



వాహన తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు మండలమైన బషీరాబాద్ ప్రాంతం చెక్‌పోస్టుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. నవాంద్గీ-ఇందర్‌చెడ్ మార్గం మలుపు వద్ద గల చెక్ పోస్టును శనివారం బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ పరిశీలించారు. తహసీల్దార్ పర్యవేక్షణలో కొంతసేపు స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలు వాహనాల తనిఖీలు చేపట్టాయి.